

# రెజ్లింగ్ చాంప్ వరంగల్

## రన్నరప్‌గా హైదరాబాద్, సంగారెడ్డికి తృతీయ స్థానం

హనుమకొండ చౌరస్తా: తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-15 రెజ్లింగ్ టోర్నీలో వరంగల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన చాంపియన్‌షిప్‌లో వరంగల్ 87 పాయింట్లతో టాప్‌లో నిలువగా, హైదరాబాద్ (81), సంగారెడ్డి (62) ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. ప్లేయర్ల మధ్య కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతీ పాయింట్ కోసం కుస్తీవీరులు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డారు. గురువారం పోటీలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన ప్లేయర్లుకు ఆమె సర్టిఫికేట్లు అందజేసి పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో అశోక్‌కుమార్, రెజ్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కరీం, కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. టోర్నీలో వేర్వేరు విభాగాల్లో నందిని, లావణ్య, మీనాక్షి, నేహాబేగం, పూజ, బాలమణి, సుదీపాసింగ్, సంతోష, గీతాహరిణి, వైశాన్వి పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు.

# జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ షురూ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: దాదాపు రెండు దశాబ్దాల తర్వాత హైదరాబాద్‌లో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నీకి గురువారం ఘనంగా తెరలేచింది. 30 ఏండ్ల నుంచి 70 ఏండ్ల పైబడిన అథ్లెట్లు యువతలా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడంతో గచ్చిబౌలి స్టేడియం కొత్త కళను సంతరించుకుంది. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తరాఖండ్, పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల నుంచి 70, 80 ఏండ్ల పైబడిన వారు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, లక్ష్మి, ప్రభుకుమార్, లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

# సెమీస్‌లో నిఖత్

## స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీ



సోఫియా(బల్గేరియా): ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్‌తో పాటు అరుంధతి చౌదరీ టోర్నీలో కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నారు. గురువారం జరిగిన మహిళల 50కిలోల క్వార్టర్స్ బౌట్‌లో నిఖత్ 5-0తో ఖాదిరి వాసిలా(ఫ్రాన్స్)పై అలవోక విజయం సాధించింది. వీరిద్దరి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. ఆది నుంచే ఇద్దరు బాక్సర్లు దూకుడు ప్రదర్శించడంతో బౌట్ రసవత్తరంగా జరిగింది. ఈ క్రమంలో నిఖత్, ఫ్రాన్స్ బాక్సర్ ఒకరిపై ఒకరు పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డారు. అయితే ఇందూరు బాక్సర్ దీటైన సమాధానమిచ్చింది. ఫ్రాన్స్ బాక్సర్‌కు ఎక్కడా అవకాశమివ్వని నిఖత్ మరింత జోరు పెంచి ఎదురుదాడికి పాల్పడింది. దీంతో తొలి రౌండ్ ముగిసే సరికి నిఖత్ 3-2 ఆధిక్యంలో నిలిచింది. రెండో రౌండ్‌లోనూ ఇద్దరు బాక్సర్లు ఎదురుదాడి విషయంలో ఒకింత వెనుక్కు తగ్గారు. అయినా జరీన్ 3-2తో ఆధిక్యం కనబరిచింది. కీలకమైన మూడో రౌండ్‌లో తన అద్భుత ప్రదర్శన కనబరుస్తూ ప్రత్యర్థి విసిరిన పంచ్‌లను నిఖత్ సమర్థంగా తిప్పికొట్టింది. శనివారం జరిగే సెమీస్‌లో లోకల్ ఫేవరేట్ జల్టిస్లవా చుకనోవా (బల్గేరియా) బాక్సర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు 66కిలోల కేటగిరీలో జాతీయ చాంపియన్ అరుంధతి చౌదరీ 5-0తో మాటోవిచ్ మిలేనా(సెర్బియా)పై అలవోకగా గెలిచింది. ఈ ఇద్దరు బాక్సర్లు మొదటి నుంచే దూకుడు కనబరిచినా.. అరుంధతి పంచ్‌ల వర్షం కురిపించింది. అప్పటికే బౌట్‌పై తన ఆధిపత్యం ప్రదర్శించిన అరుంధతి ఓవైపు దాడులను తిప్పికొడుతూ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఫైనల్లో చోటు కోసం స్లోవేకియా బాక్సర్ జెస్సికా ట్రిబ్లెవాతో అరుంధతి తలపడుతుంది. 57కిలోల విభాగం క్వార్టర్స్‌లో సాక్షి 2-3తో మమాజొనోవా కుమ్రోబోను(ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. పురుషుల కేటగిరీలో దీపక్ (75కి), నవీన్‌కుమార్ (92కి) ప్రత్యర్థులపై విజయాలతో క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు.




# భారత్ ప్రత్యర్థి ఆసీస్

## అండర్-19 ప్రపంచకప్

బెనోనీ: అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో యువ భారత జట్టు.. ఆస్ట్రేలియాతో తలపడనుంది. తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం సాధించగా.. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో పాకిస్థాన్‌పై ఆస్ట్రేలియా గెలుపొందింది. హోరాహోరీగా సాగిన పోరులో ఆస్ట్రేలియా ఒక వికెట్ తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 48.5 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. అజాన్ (52), అరాఫత్ (52) హాఫ్ సెంచరీలు చేశారు. ఆసీస్ బౌలర్లలో టామ్ స్ట్రాకర్ 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 49.1 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. హ్యారీ (50), ఒలీవర్ (49) రాణించారు. ఆదివారం జరగనున్న తుదిపోరులో ఆస్ట్రేలియాతో యువ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.



ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ పతకాలు విడుదలయ్యాయి. చరిత్రాత్మక ఈఫిల్ టవర్ నుంచి సేకరించిన ఇనుముతో తయారు చేసిన విశ్వక్రీడల పతకాలను ఫ్రాన్స్ అధ్యక్షుడు టోనీ ఎస్టాగ్వెట్ గురువారం ఆవిష్కరించారు. హెక్సాగోనల్ ఆకారంలో పతకాలు ఆకట్టుకుంటున్నాయి.



# హోరాహోరీగా వాలీబాల్ టోర్నీ

హైదరాబాద్: హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన నగరాల్లో 'విజయ్ దేవరకొండ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24' పేరిట పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో రెండు రాష్ట్రాల్లోని మొత్తం 16 సిటీల నుంచి 307 జట్లు పోటీపడుతున్నాయని ఫ్రాంచైజీ యజమాని అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన తెలిపారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.